# అర్హులైన ఓట్లు ఒకటి కూడా కోల్పోకూడదు ఎమ్మెల్యే రాగమయి

- నియోజకవర్గ స్థాయి బిఎల్ఎ ల సమావేశం
- హాజరైన డిసిసి అధ్యక్షుడు నూతి,డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్



2 లో...




జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఖమ్మం
శనివారం | 29 | ఆగస్టు | 2026 ◆ పేజీలు : 5


- 22ఏ జాబితాలోని ప్రతి సర్వే నంబర్‌ను రికార్డులతో పక్కాగా క్రాస్‌చెక్ చేయాలి
- ప్రైవేట్ భూములు పొరపాటున నమోదైతే 48 గంటల్లో పరిష్కరించాలి
- 22ఏ నుంచి తొలగించే ప్రతి సర్వే నంబర్‌కు స్పష్టమైన కారణాలు, రిమార్క్స్ నమోదు చేయాలి
- ప్రభుత్వ భూములను కాపాడుతూ, నిజమైన భూ సమస్యలను వేగంగా పరిష్కరించాలి
- 22ఏ భూముల సమస్యపై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్



# 22ఏ భూముల సమస్యల పరిష్కారంలో పారదర్శకంగా వ్యవహరించాలి

## జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** 22ఏ నిషేధిత భూముల సమస్యల పరిష్కారంలో అధికారులు పకడ్బందీగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు.22ఏ జాబితాలో ఉన్న ప్రతి సర్వే నంబర్‌ను సంబంధిత రెవెన్యూ రికార్డులతో పూర్తి స్థాయిలో పరిశీలించి, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా వివరాలను నిర్ధారించాలని ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం 22ఏ భూముల సమస్యలపై అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి రెవెన్యూ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ సమయంలో కొన్ని భూములు 22ఏ నిషేధిత జాబితాలో ఉన్నట్లు గుర్తించబడుతున్నాయని తెలిపారు. 22ఏకు సంబంధించి రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వస్తున్న ఫిర్యాదులను రెవెన్యూ అధికారులకు పంపిస్తున్నారని, వాటిపై సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి నివేదికలను క్రమం తప్పకుండా సమర్పించాలని సూచించారు.22ఏ భూముల పరిశీలన,నమోదు, తొలగింపు ప్రక్రియకు జిల్లావ్యాప్తంగా ఒకే విధమైన సాధారణ ఫార్మాట్‌ను రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. నిషేధిత భూములను ప్రధానంగా ఐదు కేటగిరీలుగా గుర్తించాలని తెలిపారు.
22ఏ నిషేధిత భూముల ఐదు కేటగిరీలు:
మొదటి కేటగిరీలో రాష్ట్ర, కేంద్ర చట్టాల పరిధిలోని నిషేధిత భూములు ఉంటాయని తెలిపారు. అసైన్‌మెంట్ భూములు, సీలింగ్ యాక్ట్, టెనెన్సీ యాక్ట్,

మిగతా 2 లో...

# రాఖీ పండుగ వేళ కిటకిటలాడుతున్న ఖమ్మం పాత బస్టాండ్

- పండుగ సందర్భాల్లో అదనపు బస్సులు నడపాలని ప్రయాణికుల విజ్ఞప్తి



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** శుక్రవారం పవిత్రమైన సోదరీసోదరుల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పౌర్ణమి (రాఖీ పండుగ) సందర్భంగా ఖమ్మం నగరంలోని పాత బస్టాండ్ ప్రాంగణం ప్రయాణికులతో తీవ్ర రద్దీగా మారింది. పండుగకు సొంత ఊళ్లకు వెళ్లేందుకు, తమ సోదరులకు రాఖీలు కట్టేందుకు బయలుదేరిన మహిళలు,ప్రజలతో బస్టాండ్ అంతా కళకళలాడుతోంది.అయితే, ఈ పండుగ వాతావరణంలో ప్రయాణికులు తీవ్ర ప్రయాణ ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.ప్రస్తుతం బస్టాండ్‌లో అందుబాటులో ఉన్న బస్సుల సంఖ్య ప్రయాణికుల రద్దీకి సరిపోకపోవడంతో

మిగతా 2 లో...

# ఎస్ బి ఐ స్లాబ్ పెచ్చులు ఊడి కస్టమర్ కు గాయాలు

- బ్యాంకు భవనాలు శిథిలావస్థకు చేరినా పట్టించుకోని సిబ్బంది, అధికారులు

**సత్తుపల్లి ఆగస్టు28(ప్రజా జ్యోతి)** పట్టణంలోని స్థానిక ఎస్.బి.ఐ బ్యాంకు అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కల్లమర్ల ప్రాణాలకు పెను శాపంగా మారింది. పట్టణంలోని మోటార్ బైక్ మెకానికల్ యూనియన్ అధ్యక్షులు సయ్యద్ వాహెద్, ఆయన భార్య ఆషా బస్టాండ్ దగ్గర గల ఎస్.బి.ఐ బ్యాంకు



లో పని ఉండటం వలన బ్యాంకు కి వెళ్ళినారు. ఈ క్రమంలో వారు బ్యాంకు పనిలో ఉండగా ఒక్కసారిగా బ్యాంకు బిల్డింగ్ స్లాబ్ పెచ్చులు ఊడి, తలమీద పడి వాహెద్ సతీమణికి తలపైన గాయమైంది.పాత కాలంలో నిర్మించబడిన భవనాల నాణ్యతా ప్రమాణాలు క్షీణించి, కూలిపోయి కస్టమర్ లు గాయాలపాలౌతున్నా బ్యాంకు అధికారులు మరియు సిబ్బంది ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకుండా వ్యవహరిస్తున్నారు, అనడానికి

మిగతా 2 లో...

## ఎస్ బి ఐ స్లాబ్ పెచ్చులు ఊడి కస్టమర్ కు గాయాలు

(మొదటి పేజీ తరువాయి...)

ఈ సంఘటనే ఉదాహరణ.స్లాబ్ పెచ్చులు ఊడి తలమీద పడగానే వెంటనే స్పందించిన బ్యాంకు అధికారులు మరియు సిబ్బంది ప్రాథమిక చికిత్స కోసం గాయపడ్డ కస్టమర్ ను ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.బ్యాంకు అధికారులు ఇకనైనా పురాతన భవనాల నాణ్యతా ప్రమాణాలు ఏ స్థాయిలో ఉన్నాయో పరిశీలించి,ఎవరికీ ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## అర్హులైన ఓట్లు ఒకటి కూడా కోల్పోకూడదు



**సత్తుపల్లి ఆగస్టు28(ప్రజా జ్యోతి)** సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ల ఆధ్వర్యంలో సత్తుపల్లి నియోజకవర్గ స్థాయిలో బూత్ లెవల్ ఏజెంట్ల (బిఎల్ ఏ) సమావేశం పట్టణంలో స్థానిక మాధురి ఫంక్షన్ హాల్ లో సమావేశం నిర్వహించినారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులునూతిసత్యనారాయణ గౌడ్,ఎస్ ఐ ఆర్ఇంచార్జ్ దైద రవీంద్ర పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గం లో అర్హులైన ఏ ఒక్కరి ఓటు హక్కు కోల్పోకుండా చూసుకోవాలి అని,సర్ కార్యక్రమం ముగిసే వరకు ఓటర్లు కానీ, బిఎల్ ఏ లు కానీ అవగాహన లేక పొరపాటు చేయవద్దని,అందరూ కలిసి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటు హక్కుతోనే సమాజాన్ని నిర్మించవచ్చని, ఓటు కాపాడుకునే హక్కు మనదేనని ఓటు విలువను వివరించారు.ఈ సమావేశానికి సత్తుపల్లి కల్లూరు మున్సిపల్ చైర్మన్ లు, వైస్ చైర్మన్ లు, ఎఎంసి చైర్మన్ లు, వైస్ చైర్మన్ లు, కౌన్సిలర్లు,5 మండలాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, టౌన్ పార్టీ అధ్యక్షులు, సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు,మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు, మహిళా నాయకులు,బియల్ ఎ లు మరియు తదితర నాయకులు పాల్గొన్నారు.

## రాఖీ పండుగ వేళ కిటకిటలాడుతున్న ఖమ్మం పాత బస్టాండ్



(మొదటి పేజీ తరువాయి...)

ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.బస్సులు బస్టాండ్‌లోకి రాగానే ప్రయాణికులు ఎక్కడానికి ఒకరినొకరు తోసుకుంటూ అల్లాడిపోతున్నారు. బస్సుల్లో కూర్చోవడానికి సీట్లు దొరకడం దేవుడెరుగు, నిలబడటానికి కూడా స్థలం లేని పరిస్థితి నెలకొంది. చిన్న పిల్లలు,వయోవృద్ధులు,మహిళలు ఈ రద్దీలో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అధికారులు తక్షణమే స్పందించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. పండుగ రోజుల్లో పెరిగే రద్దీకి అనుగుణంగా వివిధ ప్రాంతాలకు ప్రత్యేక (అదనపు) బస్సులను నడపాలని కోరుతున్నారు. అదనపు బస్సుల ఏర్పాటు: ఖమ్మం పాత బస్టాండ్ నుండి గ్రామీణ ప్రాంతాలకు, పరిసర మండలాలకు, పండుగ వేళలు అదనపు సర్వీసులు నడపాలి.తాగునీరు, ప్రాథమిక వసతులు: తీవ్ర రద్దీ కారణంతో ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తున్నందున బస్టాండ్ ప్రాంగణంలో మంచినీరు , నీడ వసతులను సజావుగా అందించాలి.పండుగ పూట ప్రజలు తమ గమ్యస్థానాలకు సురక్షితంగా, వేగంగా చేరుకునేలా ఆర్టీసీ యాజమాన్యం త్వరితగతిన చర్యలు తీసుకోవాలని,డిపో అధికారులు పాత బస్టాండ్ రద్దీపై ప్రత్యేక దృష్టి సారించి అదనపు ట్రిప్పులను అందుబాటులోకి తీసుకురావాలని ఖమ్మం జిల్లా ప్రజలు,ప్రయాణికులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

# 22ఏ భూముల సమస్యల పరిష్కారంలో పారదర్శకంగా వ్యవహరించాలి

(మొదటి పేజీ తరువాయి...)

ఆర్ఓఎఫ్ఆర్ తదితర చట్టాల పరిధిలోని భూములు ఉంటాయని వీటిలో వ్యవసాయ, వ్యవసాయేతర భూముల రకాలు ఉంటాయని పేర్కొన్నారు.రెండవ కేటగిరీలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ భూములు, మూడవ కేటగిరీలో ఎండోమెంట్,వక్ఫ్ భూములు,నాలుగవ కేటగిరీలో సీలింగ్, అర్బన్ సీలింగ్‌కు సంబంధించిన భూములు, ఐదవ కేటగిరీలో ప్రభుత్వ ప్రయోజనాలను పరిరక్షించాల్సిన ఇతర భూములు ఉంటాయని తెలిపారు.గతంలో రికార్డులను పూర్తి స్థాయిలో పరిశీలించకుండానే కొన్ని భూముల రిజిస్ట్రేషన్లు జరిగేవని, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలు సమన్వయంతో పనిచేయకపోవడం వల్ల సమస్యలు తలెత్తేవని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ చట్టానికి సవరణలు తీసుకువచ్చి నిషేధిత కేటగిరీలకు చెందిన భూముల రిజిస్ట్రేషన్లను నియంత్రించడం జరిగిందని పేర్కొన్నారు.ప్రస్తుతం సర్వే,రిజిస్ట్రేషన్,రెవెన్యూ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తున్నాయని కలెక్టర్ స్పష్టం చేశారు.



**ప్రజల్లో భయాందోళనలకు తావివ్వొద్దు:**

కొన్ని సందర్భాల్లో నిజమైన ప్రైవేట్ భూములు పొరపాటున 22ఏ నిషేధిత జాబితాలో చేరే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. అలాంటి నిజమైన కేసులను గుర్తించి నిబంధనల ప్రకారం వేగంగా పరిష్కరించాలని సూచించారు.అదే సమయంలో ప్రభుత్వ భూములను కాజేయాలనే స్వార్థ ప్రయోజనాలు కలిగిన వ్యక్తులు ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం లేదా అపోహలు వ్యాప్తి చేయడం ద్వారా తమకు అనుకూలంగా భూములను 22ఏ నుంచి తొలగించుకునే ప్రయత్నాలు చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు.నిజమైన కేసుగా నిర్ధారణ అయిన భూములను అవసరమైన రికార్డులను పరిశీలించి 48 గంటల్లోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ లో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడవద్దని స్పష్టం చేశారు.22ఏ జాబితాలోని ప్రతి భూమిని సర్వే నంబర్ వారీగా క్రాస్ వెరిఫై చేయాలని తెలిపారు.ముందుగా సంబంధిత సర్వే నంబర్ పాత 22ఏ జాబితాలో ఉందా లేదా అనే విషయాన్ని పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. పాత 22ఏ జాబితాలో లేని సర్వే నంబర్ ప్రస్తుతం 22ఏలోకి ఎలా చేరిందో, అందుకు గల కారణాలను స్పష్టంగా నమోదు చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

**22ఏ నుంచి తొలగింపులకు ప్రత్యేక విధానం:**

ఏదైనా ప్రైవేట్ భూమి పొరపాటున 22ఏ నిషేధిత జాబితాలో నమోదైనట్లు నిర్ధారణ అయితే, దానిని తొలగించేందుకు సర్వే నంబర్ వారీగా డిలీటెడ్ లిస్ట్ రూపొందించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ తెలిపారు. 22ఏ జాబితాలో భూములను చేర్చే సమయంలో అనుసరించే విధానాన్నే తొలగింపు ప్రక్రియలోనూ పాటించాలని సూచించారు. తొలగించే ప్రతి సర్వే నంబర్‌కు నిర్దిష్ట కారణాలు, స్పష్టమైన రిమార్క్స్ తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 22ఏ సమస్యలను పారదర్శకంగా, వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. అదే సమయంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.22ఏ భూములకు సంబంధించిన ఫిర్యాదులపై అధికారులు సమన్వయంతో పనిచేసి, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం మాత్రమే నిర్ణయాలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లాలోని మండల తహశీల్దార్లు, నాయబ్ తహశీల్దార్లు, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రాఖీతో సోదర బంధం.. మత సామరస్యానికి చాటింపు



**కల్లూరు, ఆగస్టు 28: ప్రజా జ్యోతి** కల్లూరు పట్టణంలో రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా సోదర సోదరీమణుల ప్రేమానురాగాలు ఆత్మీయతకు ప్రతీకగా రాఖీలు కట్టి సోదర బంధాన్ని చాటుకున్నారు. స్థానిక మున్సిపాలిటీ 17వ వార్డు కౌన్సిలర్ కనపర్తి శ్యామల రాజ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి. సాయి కృష్ణారెడ్డి, వార్డు కౌన్సిలర్లు సయ్యద్ రేష్మ ఎం.డి. ఇస్మాయిల్ పెడకంటి రామకృష్ణలకు రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాఖీ పౌర్ణమి సోదర సోదరీమణుల అనుబంధానికి ప్రతీకగా నిలిచే పండుగని అన్నారు. కుల మతాలకు అతీతంగా పరస్పర గౌరవం సోదర భావం మానవతా విలువల పెంపొందించడంలో ఇలాంటి వేడుకలు దోహదపడతాయని ప్రజా ప్రతినిధులు అధికారులు వివిధ వర్గాల మధ్య సోదర భావాన్ని చాటేలా రాఖీ పౌర్ణమి వేడుకల సందర్భంగా కార్యక్రమాన్ని నిర్వహించిన కౌన్సిలర్ కనపర్తి శ్యామల రాజ్ కుమార్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ కో-ఆప్షన్ సభ్యులు షేక్ కమ్లి మండల నాయకులు దామాల దయాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జరిగిన భీమవరం పంచాయతీ కార్యాలయం ప్రారంభోత్సవం






**వేంసూరు ఆగస్టు 28 ప్రజాజ్యోతి** శుక్రవారం భీమవరం గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి చేతుల మీదుగా పంచాయతీ కార్యాలయం ప్రారంభం కావడం ఎంతో ఆనందకరమైన విషయం అని గ్రామ సర్పంచ్ రమేష్ అన్నారు గ్రామ ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతూ, గ్రామానికి అవసరమైన మౌలిక వసతులు, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా సర్పంచ్ వంట్ల రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమం లో వేంసూరు మండలం కాంగ్రెస్ అధ్యక్షులు కాసర చంద్రశేఖర్ రెడ్డి మండల కాంగ్రెస్ నాయకులు వివిధ గ్రామాల సర్పంచ్లు ఉప సర్పంచ్ లు వార్డ్ మెంబెర్ లు మరియు కాంగ్రెస్ అభిమానులు గ్రామ ప్రజలు విరివిగా పాల్గొన్నారు.

# సోదర, సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయతలకు రాఖీ పండుగ ప్రతీక

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- మహిళల రక్షణ, గౌరవం, సాధికారతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి
- సమాజంలో సోదరభావం, కుటుంబ బంధాలను మరింత పెంపొందించేందుకు రక్షాబంధన్ స్ఫూర్తినిస్తుంది
- కలెక్టరేట్ లో రాఖీ కట్టి, మిఠాయి అందించిన బ్రహ్మకుమారీలకు శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కలెక్టర్



ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి సోదర, సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనురాగం, పరస్పర నమ్మకానికి రాఖీ పండుగ ప్రతీకగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.రాఖీ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ఖమ్మం కలెక్టరేట్ లో బ్రహ్మకుమారీలు జిల్లా కలెక్టర్ కు రాఖీ కట్టి, మిఠాయి అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వారికి శుభాకాంక్షలు తెలిపారు.రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా ప్రజలందరికీ జిల్లా కలెక్టర్ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ పండుగ కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు, సమాజంలో పరస్పర గౌరవం, సోదరభావం, ఆప్యాయతలను పెంపొందించేందుకు స్ఫూర్తినిస్తుందని అన్నారు.

సోదరీమణుల రక్షణ,గౌరవం,సాధికారత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. మహిళలకు సురక్షితమైన, గౌరవప్రదమైన వాతావరణాన్ని కల్పించడం కుటుం బం, సమాజం మొత్తానికి బాధ్యత అని పేర్కొన్నారు. మహిళల పట్ల గౌరవభావంతో వ్యవహరిస్తూ, వారి హక్కులు, భద్రత, అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని సూచించారు. రాఖీ పండుగ కేవలం సోదర,సోదరీమణుల అనుబంధానికి మాత్రమే పరిమితం కాకుండా, సమాజంలో ప్రేమ, సోదరభావం, పరస్పర సహకారం, మానవతా విలువలను మరింత బలోపేతం చేసేలా ప్రతి ఒక్కరిలో స్ఫూర్తిని నింపాలని కలెక్టర్ ఆకాంక్షించారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో,సోదరభావం తో, ఆనందంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు రాజయోగిని,బికె. అరుణ, బికె.గీత తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీ నామ కు రాఖీ కట్టిన సోదరి ధనమ్మ



ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి ఖమ్మం నెహ్రూనగర్‌లోని వరలక్ష్మి నిలయం నందు శుక్రవారం రక్షాబంధన్ సందర్భంగా బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావుకు ఆయన సోదరి ధనమ్మ రాఖీ కట్టారు. ఈ సందర్భంగా సోదరి ధనమ్మ నామ నాగేశ్వరరావును ఆశీర్వదించి, మిఠాయి తినిపించారు. అన్నాచెల్లెళ్ల ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పండుగను కుటుంబ సభ్యుల మధ్య ఆనందంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ,అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమానురాగాలు,ఆప్యాయతలు ఎల్లప్పుడూ ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. రాఖీ పండుగ కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు.

## సోదరీ,సోదరుల మధ్య అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్

- ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు



సత్తుపల్లి ఆగస్టు 28 (ప్రజా జ్యోతి) శ్రావణ పౌర్ణమి పురస్కరించుకొని,రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రక్షాబంధన్ ప్రాముఖ్యతను తెలియజేసే పలు పురాణ కథలలో సోదరీమణుల కుటుంబాల రక్షణ కోసం సోదరులు చేసిన త్యాగాలను గుర్తు చేసుకుంటూ, అక్క, తమ్ముడు అన్నా, చెల్లెల ప్రేమ ,అనురాగాలకు ప్రతీకగా రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సోదరులకు రాఖీ కట్టి ఆశీస్సులు తీసుకోవాలని, దూర ప్రాంతాలలో నివసిస్తున్న సోదరీమణులు కుటుంబ సభ్యుల అనుమతితో అన్నా, తమ్ముడు గృహాలకు వెళ్లి రాఖీని కట్టి స్వీట్లు తినిపించి, రక్తసంబంధాన్ని తెలియజేశారు. అనంతరం సోదరులు కుటుంబం ఆప్యాయంగా ఆదరించి, ఆడబిడ్డకు ఇచ్చిన కానుకులను తీసుకొని జీవించినంత కాలం కష్ట, సుఖాలలో ఒకరి కుటుంబానికి మరొకరు రక్షణగా ఉండే విధంగా దీవించాలని భగవంతుని ప్రార్థించారు. పట్టణంలోని కాకర్లపల్లి రోడ్డు వెంకటేశ్వర రెసిడెన్సి లో చిన్నారులు సోదరులకు నుదుటన కుంకుమ దిద్ది,రాఖీ కట్టి స్వీట్లు తినిపించి,మంగళ హారతులతో సంస్కృతి, సాంప్రదాయాలను తెలియజేసే విధంగా రాఖీ పర్వదినాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాయి శ్రీరామ్, సంజీత్, దీపక్, రోహిత్, చైతన్య, సుదీక్ష, జ్ఞాపిక, తేజస్విని పాల్గొన్నారు.

## తాజుద్దీన్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎంపీ నామ



ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి బీఆర్ఎస్ పార్టీ ముస్లిం మైనార్టీ విభాగం ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు మహమ్మద్ తాజుద్దీన్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన నేపథ్యంలో బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు శుక్రవారం తాజుద్దీన్ స్వగృహానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. తాజుద్దీన్ మృతి వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. తాను ఢిల్లీలో ఉండటం వల్ల తాజుద్దీన్‌ను కడసారి చూడలేకపోయానని నామ ఆవేదన వ్యక్తం చేశారు. తాజుద్దీన్‌తో తనకున్న ఆత్మీయ అనుబంధాన్ని, కలిసి పనిచేసిన సందర్భాలను గుర్తుచేసుకున్నారు. పార్టీ పట్ల ఎంతో నిబద్ధతతో పనిచేసిన తాజుద్దీన్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా అర్ధరాత్రి అయినా స్పందించే వ్యక్తిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో మాట్లాడిన నామ,పిల్లల చదువుల గురించి ఆరా తీశారు. కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఏ అవసరం వచ్చినా, ఎలాంటి ఇబ్బంది ఎదురైనా తనకు నేరుగా ఫోన్ చేయాలని సూచించారు. తన సామాజిక వర్గానికే పరిమితం కాకుండా, ఎవరికి ఏ ఆపద వచ్చినా వెంటనే స్పందించి అండగా నిలిచే వ్యక్తిగా తాజుద్దీన్ మంచి పేరు సంపాదించుకున్నారని పరామర్శకు వచ్చిన తెలిపారు. పార్టీ కోసం, ప్రజల కోసం నిబద్ధతతో సేవలందించిన తాజుద్దీన్‌ను కోల్పోవడం తీవ్రంగా బాధించిందని నామ పేర్కొన్నారు. ఆయన మృతి బీఆర్ఎస్ పార్టీకి, కుటుంబ సభ్యులకు తీరని లోటని పేర్కొంటూ, తాజుద్దీన్ కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ మాజీ ఫ్లోర్ లీడర్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు కర్నాటి కృష్ణ, షేక్ మక్బుల్, మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి, మాజీ కార్పొరేటర్ బూడిగెం శ్రీను, నాయకులు బాణాల వెంకటేశ్వర్లు, కనకమేడల సత్యనారాయణ,మోరంపూడి ప్రసాద్ రావు,బోజెడ్ల రామ్మోహన్ రావు, తాజద్దీన్, మరికంటి రేణుబాబు, తన్నీరు రవి, రేగళ్ల కృష్ణప్రసాద్, ముబీన్, సద్దాం, రసూల్, ఫిరోజ్ ,ఆసీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ కార్డు

- స్మార్ట్ రేషన్ కార్డ్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



పాలేరు ఆర్.సీ ఆగస్టు28 ప్రజా జ్యోతి కూసుమంచి మండలంలోని జజ్జులరావుపేట గ్రామంలో ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సులభంగా అందేలా నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డ్ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కంచర్ల జీవన్ రెడ్డి ఉప సర్పంచ్ మార్గం గంగాభవాని కలిసి స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులను అందజేసి, ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని వారి సూచించారు .సీఎం రేవంత్ రెడ్డి మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ సేవలు చేరేలా కృషి చేస్తోందని కాంగ్రెస్ పార్టీ నాయకులు కంచర్ల జీవన్ రెడ్డి తెలిపారు. స్మార్ట్ కార్డ్ ద్వారా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు మరింత పారదర్శకంగా, వేగంగా ప్రజలకు అందుతాయని ఆయన అన్నారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మార్గం గంగాభవాని , వార్డు సభ్యులు పడిశాల వినయ్, కాంగ్రెస్ పార్టీ గ్రామా అధ్యక్షులు కలకొండ పున్నయ్య, నాయకులు పడిశాల గోపి, జిల్ల పల్లి ఉప్పయ్య గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టీఎన్జీవోస్ ఈ బ్లాక్ అసోసియేషన్ ఎన్నిక...

- అధ్యక్ష కార్యదర్శులుగా ఏలూరి, రాయల...



ఖమ్మం రూరల్ ప్రజా జ్యోతి : ఏదిలాపురం మున్సిపాలిటీ పరిధిలోని టీఎన్జీవోస్ కాలనీ ఈ బ్లాక్( ఎదులాపురం మున్సిపాలిటీ పరిధి ) వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నిక శుక్రవారం జరిగింది. టీఎన్జీవోస్ కాలనీలో జరిగిన ఈ ఎన్నిక లో భాగంగా అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఏలూరి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షురాలుగా పి వెంకట నరసమ్మ, కార్యదర్శిగా రాయల మురళీకృష్ణ ప్రసాద్, జాయింట్ సెక్రటరీగా జి మృదుల, కోశాధికారిగా రాసాల వెంకటేశ్వర్లు (వెంకట్ ), ఈసీ సభ్యులుగా కే సత్యనారాయణ, పి జ్వాలా నరసింహారావు లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితోపాటు మరో ఏడుగురు ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఎన్నికైనట్లు ఈ ఎన్నికల అధికారి పి నాగ చారి తెలిపారు. నూతనంగా ఎన్నికైన అసోసియేషన్ బాధ్యులు మాట్లాడుతూ టీఎన్జీవోస్ కాలనీ ఈ బ్లాక్ సర్వతోముఖాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీఎన్జీవోస్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## బసవరాజు శ్రీనివాస్ పై నిందలు వేయడం కవితమ్మకు తగదు

- ఖమ్మం అర్బన్ జిల్లా కార్పొరేషన్ ఉపాధ్యక్షులు, బ్రాహ్మణ సంఘ నాయకులు కోసూరి ప్రసాద్



**ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి** జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో కోసూరి ప్రసాద్ జిల్లా బ్రాహ్మణ సంఘ నాయకులతో కలిసి మాట్లాడుతూ భారత రాష్ట్ర సేన అధ్యక్షురాలు కవిత రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్ పొన్నాడ సుబ్రమణ్య ప్రసాద్ పై చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్ స్వగ్రామం మధిర నియోజకవర్గం,ఎర్రుపాలెం మండలం చోపకట్లపాలెం అని ఆయన విద్యాభ్యాసం అంతా తెలంగాణలోనే అని ఎవరో వ్రాసి ఇచ్చిన స్క్రిప్ట్ చదివిన మీరు స్క్రిప్ట్ ను క్షుణ్ణంగా పరిశీలించి మాట్లాడి ఉంటే బాగుండేదని హితవు పలికారు.భారత రాష్ట్ర సేన అధ్యక్షులుగా ఉన్న కవితమ్మ మీకు ప్రజా ప్రతినిధిగా ఎంతో అనుభవం ఉన్న మీరు నిజా నిజాలు తెలుసు కోకుండా మాట్లాడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు.బసవరాజు శ్రీనివాస్ తెలంగాణ వాసి అని ముఖ్యంగా మా ఖమ్మం ప్రాంత వాసి అని మీకు ఆయనకు సంబంధించి ఎటువంటి ఆధారాలు కావాలన్నా మీకు ఇవ్వటానికి మేము సిద్ధంగా ఉన్నామని అన్నారు.అదేవిధంగా ఆయన యస్ సి ఆడపడుచులను విమర్శించారని అనటం విడ్డూరంగా ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో వనం కృష్ణవేణి,కలవల శ్రీనివాస్,ఊటుకూరు చక్రధర్ రావు, ఏడునూతల ప్రభాకర్ రావు , మేడికొండూరు ప్రసాద్, ఉన్నకోట సంతోష్,అయ్యదేవరరాంగోపాల్, ఏడునూతల ఉదయ్ కుమార్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## జిల్లా కాంగ్రెస్ కమిటీ లో దారావత్ భద్రు నాయక్ కు సముచిత స్థానం



**కారేపల్లి, ఆగస్టు 28, ప్రజా జ్యోతి:** ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ లో, సింగరేణి మండల సీనియర్ నాయకులు, పొలంపల్లి మాజీ సర్పంచ్ దారావత్ భద్రు నాయక్ కు శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి గా పార్టీ అధిష్టానం అవకాశం కల్పించింది, నమ్ముకున్న పార్టీ ను విడకుండా ఎల్లప్పుడూ కాంగ్రెస్ కార్యకర్తల కు అండగా నిలిచిన భద్రు నాయక్, పార్టీ విధానాలను ప్రజల్లో తీసుకువెళ్లి పార్టీ సంస్థాగత నిర్మాణం లో కీలక పాత్ర పోషిస్తూ, ప్రజాప్రభుత్వ పథకాలను ప్రజల్లో అవగాహనా కల్పిస్తూ పార్టీ ను బలోపేతం చేస్తున్నారు, అతను పార్టీకి చేస్తున్న సేవను గుర్తించి పార్టీలో సంశిత స్థానం కల్పించినందుకు ఎమ్మెల్యే మాలోత్ రామదాసు నాయక్, జిల్లా పార్టీ నాయకత్వానికి, రాష్ట్ర పార్టీ నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లా కమిటీ లో ఎన్నికైన దారావత్ భద్రు నాయక్ ను మండల కాంగ్రెస్ నాయకులు ,ప్రజాప్రతినిధులు, అధికారులు, అభిమానులతో పాటు భాగ్యనగర్ తండా సర్పంచ్ బానోత్ హీరాలాల్, నాయకులు గుగులోత్ భీముడు నాయక్, మండల నాయకులు భగవాన్ దాస్, రాందాస్ నాయక్ తారాచంద్, బాబు, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు హర్ష నాయక్, మండల పార్టీ కో ఆర్డినేటర్ గాంధీ, ఉప సర్పంచ్ భిక్కులాల్, ఈర్య నాయక్, మోతిలాల్, మహేష్, సుమ, పద్మ, భూలి, జ్యోతి, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.


## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేసిన బండారు నరసింహారావు



**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** మండల కేంద్రంలో రైతు వేదిక నందు శుక్రవారం నాడు మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు స్మార్ట్ రేషన్ కార్డులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై రేషన్ కార్డు లబ్ధిదారులకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులను జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి , మండల కాంగ్రెస్ అధ్యక్షులు బొగ్గుల శ్రీనివాస్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. తనంతరం మాట్లాడుతూ బండారు నరసింహారావు తెలంగాణ ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా పేద ప్రజలకు అందిస్తున్న సన్న బియ్యం, ఇతర సరుకులను అందించేందుకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నంద్రు అశ్విని, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఐలూరి వెంకటేశ్వర రెడ్డి, ఎస్.కె శబాష్, షేక్ ఇస్మాయిల్, కే వెంకట నరసయ్య, బి గోవర్ధన రెడ్డి, ముక్కెర రామకృష్ణారెడ్డి ఆర్ ఐ రవికుమార్, ఎర్రుపాలెం డీలర్లు ఎస్.కె ఇమాంస, దారా శ్రీనివాస రావు, రెవెన్యూ సిబ్బంది, రేషన్ కార్డు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత రామనాథం

**మధిర ప్రజా జ్యోతి** మున్సిపాలిటీ పరిధిలోని ఇల్లందులపాడుకు చెందిన తాళ్ళూరి కృష్ణ – మరియమ్మ దంపతుల కుమారుడు జస్వంత్, ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం మాచినేని పాలెం గ్రామానికి చెందిన కాకాని జయరాజు – మణి దంపతుల కుమార్తె హేమలతల వివాహం మాచినేని పాలెం గ్రామంలోని తెలుగు బాప్టిస్ట్ చర్చిలో బంధుమిత్రుల సమక్షంలో వైభవంగా జరిగింది.ఈ సందర్భంగా మధిర మండలంలోని దెందుకూరు ఎస్ఆర్ కన్వెన్షన్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి మధిర మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత రామనాథం హాజరయ్యారు. వేడుకకు విచ్చేసిన ఆమెకు తాళ్ళూరి కుటుంబ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు.అనంతరం వేదికపై ఉన్న నూతన వధూవరులు జస్వంత్ – హేమలతలను చైర్ పర్సన్ఆశీర్వదించి,శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూర్యదేవర కోటేశ్వరరావు,తాళ్లూరు రాధా కుమార్, వేల్పుల కొండయ్య, తాళ్లూరి కుటుంబ సభ్యులు మరియు బంధుమిత్రులు పాల్గొన్నారు.



## తోబుట్టువుల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ

- ప్రేమ,ఆప్యాయతలకు ప్రతీక రాఖీ పండుగ (రక్షాబంధన్)



**కారేపల్లి, ఆగస్టు 28, ప్రజాజ్యోతి:** అన్నాచెల్లెళ్ల, అక్క తమ్ముడిల మధ్య ఉన్న ప్రేమ,ఆప్యాయత,అనురాగం,పరస్పర నమ్మకానికి రక్షాబంధన్ ప్రతీకగా నిలుస్తుంది. సింగరేణి మండలంలో శుక్రవారం రాఖీ పండుగను తోబుట్టువులతో అన్నదమ్ములు ఘనంగా నిర్వహించుకున్నారు. సోదరీమణులు తమ సోదరుల చేతికి రాఖీ కట్టి, వారికి మిఠాయిలు తినిపించి వారి వద్ద ఆశీర్వాదం తీసుకున్నారు. సోదరులు అక్షింతలతో సోదరీమణులను ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని మనసారా దీవించారు. సుదూర ప్రాంతాల్లో ఉన్నటువంటి ఆడపడుచులు కూడా సోదరులపై ఉన్న ప్రేమ అనురాగాలతో వారి సొంత గ్రామాలకు వచ్చి ఎంతో ఆనందంగా రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు.మండల పరిధిలోని అన్ని గ్రామాలలో ప్రతి ఇల్లు సోదర సోదరీమణులతో కళకళలాడుతూ పండగ వాతావరణం ఉట్టి పడింది.

## ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ సాధ్యం

- స్మార్ట్ కార్డులను పంపిణీ చేసిన మాజీ ఎంపీపీ జూకూరి. గోపాలరావు, సర్పంచ్ మంగమ్మ



**పాలేరు ఆర్.సీ ఆగస్టు28 ప్రజా జ్యోతి** నిరుపేదల సంక్షేమం కోసం పాటుపడేది ఒక కాంగ్రెస్ పార్టీని కూసుమంచి మాజీ ఎంపీపీ జూకూరి. గోపాలరావు అన్నారు. కూసుమంచి మండల పరిధిలోని పెరిక సింగారం గ్రామంలో శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్థానిక సర్పంచ్ మంగమ్మ కలిసి స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం మాజీ ఎంపీపీ . జూకూరి గోపాలరావు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర రెవిన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో నిరుపేదల సంక్షేమం కోసం పాటుపడేది ఒక కాంగ్రెస్ పార్టీ అని ఇప్పటివరకు ఏ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలకు అందించటానికి ముందుకు రాకపోగా ఎన్నో రేషన్ కార్డులను కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేయగా వాటిని స్మార్ట్ కార్డులుగా మలిచి ప్రజలకు అందిస్తుంది కేవలం ప్రజా ప్రభుత్వమని వారు తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తుందని వారు అన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తుందని వారు చెప్పారు. పేపర్లకు స్వఫీ స్మార్ట్ రేషన్ కార్డును అందజేస్తుందని, రేషన్ కార్డు కలిగిన వారందరూ ఈ కార్డును అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు . ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి జయమ్మ, పాలకమండలి సభ్యులు జి.పి.ఓ. ఖాదర్ పాషా ,డీలర్ కృష్ణ, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కురి వెంకటేశ్వర్లు, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏడుకొండలు, మల్లేశ్వరరావు, అంగనవాడి టీచర్ రమాదేవి, గ్రామ దీపికలు వేముల ఉమా, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదం వ్యక్తికి గాయాలు..కాపాడిన 108 సిబ్బంది

**సత్తుపల్లి ఆగస్టు28(ప్రజా జ్యోతి )** పట్టణ పరిధిలోని కాకర్లపల్లి రోడ్ లో మహిళా స్కూటీ –బైకు యాక్సిడెంట్ జరిగింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఇఎంటి (ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ )గొల్లమందల కృష్ణ, పైలెట్ కట్టం మహేష్ హుటా హుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. స్కూటీ మహిళ అక్కడి నుంచి తప్పించుకుని వెళ్ళిపోయింది. ద్విచక్ర వాహనదారుడు బానోత్ నరసింహారావు పెనుబల్లి మండలం బ్రహ్మలకుంట గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా రుద్రాక్ష పల్లిలో ఉన్న చెల్లితో రాఖీ కట్టించుకునితిరుగుప్రయాణంలో కాకర్లపల్లి వద్ద యాక్సిడెంట్ జరిగింది. గాయాల పాలైన వ్యక్తిని సత్తుపల్లి 108 లో ఎక్కించుకొని చికిత్స అందిస్తూ, సత్తుపల్లి ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో చేర్పించారు. సకాలంలో స్పందించిన సత్తుపల్లి 108 సిబ్బందిని కాకర్లపల్లి గ్రామస్తులు, ప్రోగ్రాం మేనేజర్ షేక్.నజీరుద్దీన్, జిల్లా మేనేజర్ ఆలేటి ప్రణయ్ కుమార్ అభినందించారు.



# గొరిళ్ళ పాడు తండాలో ఘనంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
- కూసుమంచి ఎంపీపీ బానోత్ శ్రీనివాస్ నాయక్
- పారదర్శకత కోసమే క్యూఆర్ కోడ్ స్మార్ట్ కార్డులు



**పాలేరు ఆర్.సీ ఆగస్టు28 ప్రజా జ్యోతి** రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని కూసుమంచి మండల మాజీ ఎంపీపీ బానోత్ శ్రీనివాస్ నాయక్ తెలిపారు. కూసుమంచి మండల పరిధిలోని గౌరిల పాడు తండా గ్రామంలో శుక్రవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కూసుమంచి మండల మాజీ ఎంపీపీ బానోత్ శ్రీనివాస్ నాయక్, స్థానిక సర్పంచి బానోత్ సరస్వతి, నాయకులతో కలిసి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ బానోత్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ,తెలంగాణ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు.క్షేత్రస్థాయిలో ప్రతీ పథకం నేరుగా లబ్ధిదారునికి అందేలా చూస్తున్నామని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఈ కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు వాటర్‌ప్రూఫ్‌తో పాటు క్యూఆర్ కోడ్,అధునాతన భద్రతా ఫీచర్లతో ఉంటాయని.. దీనివల్ల రేషన్ పంపిణీ వ్యవస్థలో పారదర్శకత పెరుగుతుందని స్పష్టం చేశారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ కార్డులు అందిస్తామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. స్థానిక సర్పంచి బానోత్ సరస్వతి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించే మహా లక్ష్మి,గృహజ్యోతి, చేయూత పింఛన్లు వంటి పథకాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బానోత్ రవి, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ ,రేషన్ డీలర్ భానుత్ శంకర్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బానోత్ బాలాజీ ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాసు నాయక్, మంచ నాయక్, కిషన్, వెంకన్న ,గోపీచంద్, జీవన్ లాల్ శ్రీను, చోటి నాయక్,డ్వాక్రా గ్రూప్ సభ్యులు, మహిళలు,గ్రామ పెద్దలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## వేంసూరు ఎస్సైగా పి ప్రదీప్ బాధ్యతలు స్వీకరణ

- శాంతి భద్రతలు కాపాడటమే నా కర్తవ్యం -ఎస్సై



**వేంసూరు ఆగస్టు 28 ప్రజాజ్యోతి** వేంసూరు ఎస్సైగా పి ప్రదీప్ బాధ్యతలు స్వీకరించారు ఇటీవల జరిగిన బదిలీలు కార్యక్రమంలో భాగంగా వేంసూరు ఎస్ఐగా ప్రదీప్ తన బాధ్యతలను నిర్వర్తించనున్నారు తెలంగాణ శివారు మండలమైన వేంసూరు మండలానికి రావడం నాకు చాలా ఆనందంగా ఉందని మరి ముఖ్యంగా మండలంలోని శాంతిభద్ర లకు విఘాతం కలగకుండా ఇక్కడ శాంతి భద్రత లక్ష్యంగా పని చేస్తానని ప్రజలందరూ సంతోషంగా ఉండటమే నా ముందున్న కర్తవ్య మంటూ ప్రదీప్ అన్నారు ఎక్కడికి అక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తూ ఎటువంటి అవాంఛనీయ సంఘటన ఎదురు కాకుండా మండలాన్ని శాంతిభద్రత విషయంలో ఓ గొప్ప మండలంగా తయారుచేయడానికి నేను నా సాయి శక్తులా పనిచేస్తానని ఈరోజు బాధ్యతలు స్వీకరించిన ఎస్సై ప్రదీప్ అన్నారు

## స్మార్ట్ రేషన్ కార్డ్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



**పాలేరు ఆర్.సీ ఆగస్టు28 ప్రజా జ్యోతి** కూసుమంచి మండలంలోని గురువాయిగూడెం గ్రామంలో ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సులభంగా అందేలా నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డ్ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బొల్లంపల్లి సుధాకర్ రెడ్డి, నాగిరెడ్డి రమేష్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు బానోత్ సత్యం పాల్గొన్నారు.ఈ సందర్భంగా లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులను అందజేసి, ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని వారి సూచించారు . స్మార్ట్ కార్డులు పంపిణీ అనంతరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొల్లంపల్లి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ సేవలు చేరేలా కృషి చేస్తోందని, స్మార్ట్ కార్డ్ ద్వారా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు మరింత పారదర్శకంగా, వేగంగా ప్రజలకు అందుతాయని, గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, పల్లెలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు ,సంక్షేమ పథకాలు కల్పించి గ్రామాలను అన్నిరంగాల అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అన్నా చెల్లె అనుబంధానికి ప్రతీకగా రాఖీ పౌర్ణమి..

- మండల వ్యాప్తంగా ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు..



**ఖమ్మం రూరల్ ప్రజా జ్యోతి :** అన్నా చెల్లెలు, అక్కా తమ్ముళ్ల ప్రేమానురాగాలకు ప్రతీకగా నిర్వహించే రాఖీ పౌర్ణమి వేడుకలు ఎదులాపురం మున్సిపాలిటీ, ఖమ్మం రూరల్ మండలం కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. శ్రావణ పౌర్ణమి (రాఖీ పౌర్ణమి) రోజు నిర్వహించే రక్షాబంధన్ వేడుకలకు సుదూర ప్రాంతాల నుంచి ఆడపడుచులు పుట్టినిళ్లకు చేరుకున్నారు.సోదరులకు రాఖీ కట్టి, మిఠాయిలు తినిపించి వారి ప్రేమను చాటుకున్నారు. సోదరీమణులకు అన్న తమ్ముళ్లు రక్షణగా ఉంటానని హామీనిస్తూ కానుకలు అందజేసి వారి ఆత్మీయతను చాటుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



## వాడ వాడన రాఖీ వేడులు...

**నేలకొండపల్లి, ఆగస్టు 28 ప్రజా జ్యోతి:** మండలం లోని వివిధ గ్రామాలలో శుక్రవారం రాఖీ పండుగ ను ఘనంగా నిర్వహించారు. అక్కా-చెల్లలు రాకతో కుటుంబాలలో సందడి నెలకొంది. సోషల్ మీడియా వేదికగా పలువురు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మండలం కేంద్రంలో రాఖీల, మరియు బేకరి దుకాణాల వద్ద జనంతో కిక్కిరిసిపోయాయి. నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, మండల అధ్యక్షుడు కోడాలి గోవిందరావు, రాయపూడి నవీన్, పాకనాటి కన్నారెడ్డి, చెరుకుపల్లి రాజేష్ కడియాల నరేష్ తదితరులు మండల ప్రజలకు రాఖీ శుభాకాంక్షలు తెలిపారు. అన్నా-చెళ్లలు. అక్క-తమ్ముడు మధ్య అనుబంధాలు మరింత పెరగాలని ఆకాంక్షించారు.







## బైక్ పై నుంచి పడి యువకుడు కు తీవ్ర గాయాలు



**నేలకొండపల్లి, ఆగస్టు 28 ప్రజా జ్యోతి:** ప్రమాదవశాత్తు బైక్ నుంచి పడి యువకుడు కు తీవ్ర గాయాలైయ్యాయి.స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలం లోని మంగాపురం తండా కు చెందిన భూక్యా రామచందర్రావు (26) అనే యువకుడు శుక్రవారం తండా నుంచి వల్లభి కి బైక్ పై వెళ్తున్నాడు. బైక్ అదుపు తప్పి ప్రమాదవశాత్తు రోడ్డు పై పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలైయ్యాయి. స్థానికులు గమనించి 108 కు సమాచారం అందించటంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు.